క్లుప్తంగా

స్టూడెంట్ కిట్లు పంపిణీ



విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలోని వన్నలి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు మంగళవారం పంపిణీ చేశారు. సర్పంచ్ గార రమణ, మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు ఎస్.రామ్మూర్తినాయుడు చేతులమీదుగా విద్యార్థులకు కిట్లు అందజేశారు. యూనిఫాం, విద్యాసామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు గౌరీశ్వరరావు విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సత్యంనాయుడు, జీఎంఆర్ వలంటీర్ గౌరి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ స్పెషల్ డ్రైవ్



ఆగూరులో ఆధార్ స్పెషల్ డ్రైవ్ సేవలను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: మండలంలోని ఆగూరు, బొద్దాం తదితర గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఆధార్ స్పెషల్ డ్రైవ్ సేవలను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. మండలంలో విడతల వారీగా గ్రామ సచివాలయాల్లో ఆధార్ స్పెషల్ డ్రైవ్ సేవలు ఏర్పాటు చేసి, ఆధార్‌కార్డుల అప్‌డేట్, మార్పులు చేర్పులకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఈ సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మున్సిపల్ కమిషనర్ పర్యటన



పారిశుధ్యంపై అధికారులకు సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి మంగళవారం పర్యటించారు. పారిశుధ్య చర్యలను ముమ్మరం చేయాలని, ప్రతీ వార్డులో పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. వర్షపునీటి నిల్వలు లేకుండా చూడాలని, కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పూడికలు తొలగించాలని తెలిపారు. చిన్నబజారులో రోడ్లపైకి వచ్చిన షాపులను పరిశీలించి, రోడ్డు భాగంలో షాపులు లేకుండా చూడాలని షాపు యజమానులకు సూచించారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



ఆక్రమణదారులు వేసిన పూరిపాక

బొబ్బిలి రూరల్: మండలంలోని శివడవలస గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ సర్పంచ్ నారాయణరావు ఓ ప్రకటనలో మంగళవారం డిమాండ్ చేశారు. సర్వే నంబరు 65లో ప్రభుత్వ స్థలం ఉందని, ఆ స్థలంలో కొంతమంది అక్రమంగా పూరిపాకలు వేసి, ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. ఇదే విషయంపై రెవెన్యూ అధికారులు, కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఇదే విషయమై లోకాయుక్తాలో కూడా ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

అన్నా క్యాంటీన్ మరమ్మతులకు టెండర్ ఖరారు

బొబ్బిలి: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న అన్నా క్యాంటీన్ మరమ్మతులకు టెండర్ ఖరారైనట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి వెల్లడించారు. ఇదే విషయమై ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రూ.5 లక్షల ప్రభుత్వ నిధులతో చేపట్టే ఈ పనులకు సంబంధించి, టెండర్లకు పిలవగా, బొరే శేషుబాబు ఈ టెండర్‌ను దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. ప్లంబింగ్, తాగునీరు, విద్యుద్దీకరణ, సీసీ కెమెరాలు, ఎన్టీఆర్, చంద్రబాబు ఫొటోలతో ఫ్లెక్సీల ఏర్పాటు వంటి పనులు చేపట్టనున్నారన్నారు. రానున్న రెండు రోజుల్లో పనులు ప్రారంభించి, ఆగస్టు 15వ తేదీలోగా పనులు పూర్తి చేసి, క్యాంటీన్‌లు ప్రారంభిస్తామన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్

రాజాం: పట్టణంలోని పలు ప్రాంతాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు మంగళవారం చేపట్టారు. వర్షాకాలం నేపథ్యంలో కాలువలు, లోతట్టు ప్రాంతాల్లో నిల్వ ఉండే నీటిలో దోమలు ఎక్కువగా పెరిగి, తద్వారా మలేరియా, డెంగీ జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశాలు ఉండడంతో ఈ చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో పారిశుధ్య పనులు కూడా ముమ్మరం చేశామన్నారు.

చదువులు సాగేదెలా..?

- రామభద్రపురం ఉన్నత పాఠశాలను వేధిస్తున్న ఇంగ్లిష్ టీచర్ల కొరత
- హైస్కూల్ ప్లస్‌లో సైతం అధ్యాపకులు లేని వైనం
- ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులే హైస్కూల్ ప్లస్‌కు దిక్కు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



రామభద్రపురం జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడితో జూనియర్ కళాశాలలో బోధన

రామభద్రపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. ప్రధానంగా ఇక్కడ ఇంగ్లిష్ టీచర్ల కొరత ఎక్కువగా ఉండడంతో పాటు ఇక్కడి హైస్కూల్ ప్లస్(జూనియర్ కళాశాల)లో అస్సలు అధ్యాపకులే లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా పరిషత్ పాఠశాల సిబ్బంది పైనే కళాశాల విద్యార్థులు పూర్తిగా ఆధారపడిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో విద్యారంగం బాగుపడిన తీరును ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో విద్యారంగంలో విప్లవాత్మకమైన సంస్కరణలు అమల్లోకి వచ్చాయి. ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వ హయాంలో విద్యారంగం ఒడిదుడుకులకు గురవుతోంది. మళ్లీ కష్టాలు మొదలవుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ సర్కారు విద్యారంగానికి పెద్దపీట వేసి, అన్ని పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు ప్రతీ విద్యార్థికి ప్రతీ పాఠ్యాంశం సులభంగా అర్థమయ్యేలా విద్యాసామగ్రి సమకూర్చింది. ఉపాధ్యాయులకు పాఠాలు బోధించేందుకు డిజిటల్ ఫ్లాట్ ప్యానల్ బోర్డులు, స్మార్ట్ టీవీలను అందించింది. ప్రస్తుత కూటమి సర్కారు మాత్రం పాఠశాలలు పునఃప్రారంభమై దాదాపు రెండు నెలలవుతున్నా ఇప్పటికీ పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించలేదు. ప్రత్యామ్నాయ చర్యలు కూడా చేపట్టడం లేదు. ఈ నేపథ్యంలో సరిపడ ఉపాధ్యాయులు లేకుంటే తమ చదువులు ఎలా సాగుతాయని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. చంద్రబాబు సర్కారు ఇలానే వ్యవహరిస్తే భవిష్యత్‌లో విద్యార్థులకు ఇబ్బందులు తప్పవని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.



ఇంగ్లిష్ టీచర్లను నియమించాలని కోరుతున్న పదో తరగతి విద్యార్థులు

900 మందికి ఇద్దరే..

స్థానిక ఉన్నత పాఠశాలలో దాదాపు 900 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ ఇద్దరు ఇంగ్లిష్ టీచర్లు మాత్రమే పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 17 సెక్షన్లు ఉండగా, ఒక్కో సెక్షన్‌కు 50 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. ఈ లెక్కన నలుగురు ఇంగ్లిష్ టీచర్లను ఇంకా నియమించాల్సి ఉంటుంది. పూర్తిస్థాయిలో బోధకులు లేకపోవడంతో రెండు సెక్షన్‌లను కలిపి తరగతులు నిర్వహిస్తున్నారని, ఎక్కువ మందిలో పాఠ్యాంశాల బోధన జరగడంతో సరిగా అర్థం కావడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. ఇలా అయితే పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడం కష్టమేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో ఇద్దరు ఇంగ్లిష్ టీచర్లను నియమించాలని కోరుతున్నారు.

హైస్కూల్ ప్లస్‌దీ అదే పరిస్థితి..

పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కాకూడదన్న సదుద్దేశ్యంతో గత ప్రభుత్వం హైస్కూల్ ప్లస్ పేరుతో జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేసింది. వీటిల్లో కూడా తరగతులు ప్రారంభమై దాదాపు రెండు నెలలు కావస్తున్నా.. తరగతుల నిర్వహణకు ఇప్పటికీ స్పష్టమైన మార్గదర్శకాలు వెలువడకపోవడం సరైంది కాదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రామభద్రపురం హైస్కూల్‌లో నిర్వహిస్తున్న జూనియర్ కళాశాలలో ఎంపీసీ గ్రూపులో నలుగురు, సీఈసీ గ్రూపులో 17 మంది జాయిన్ అయ్యారు. వీరికి హైస్కూల్ సిబ్బందితోనే పాఠ్యాంశాల బోధన చేస్తున్నారు తప్ప ప్రత్యేకంగా అధ్యాపకులను నియమించలేదు. ఈ ఏడాది తమ విద్యాభ్యాసం ఎలా ఉంటుందోనని ఇంటర్మీడియట్ విద్యార్థుల్లో ఆందోళన నెలకొంది. సీఈసీ గ్రూపులో ప్రవేశం పొందిన విద్యార్థులకు కామర్స్ అధ్యాపకుడు లేకపోవడంతో ఇప్పటివరకు ఆ సబ్జెక్టు బోధనే జరగలేదు. రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలని, లేకుంటే మా చదువులు సక్రమంగా సాగే పరిస్థితి కనిపించడం లేదని ఆ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్ అధ్యాపకుల నియామకం జరగకపోతే వేరే కళాశాలకు వెళ్లిపోతామంటున్నారు. ఇప్పటికైనా రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే విషయమై ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావును సంప్రదించగా, ఇంగ్లిష్ టీచర్ల కొరత వాస్తవమేనని ఈ సమస్యను డీఈవో దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు



విద్యార్థి ఆరోగ్య సమస్యను అడిగి తెలుసుకుంటున్న వైద్యాధికారి అసిరినాయుడు



తెర్లాం: కుమ్మరిపేటలో విద్యార్థినికి ఆరోగ్య తనిఖీలు చేస్తున్న తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారిణి దివ్యభారతి

రేగిడి: మండలంలోని చాటాయివలస, ఉప్పర్నాయుడువలస గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సీహెచ్ అసిరినాయుడు ప్రతీ విద్యార్థి ఆరోగ్యం పరిశీలించి, మెరుగైన ఆరోగ్యానికి పలు సూచనలు చేశారు. ప్రతిరోజూ పౌష్టికాహారంతో కూడిన ఆహారం తీసుకోవాలని, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని కుమ్మరిపేట కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయంలోని విద్యార్థులకు మంగళవారం ఆరోగ్య తనిఖీలు చేశారు. తెర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి దివ్యభారతి ప్రతీ విద్యార్థి ఆరోగ్య సమస్యను అడిగి తెలుసుకుని, మెరుగైన ఆరోగ్యానికి పలు సూచనలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే జ్వరాలతో బాధపడుతున్న ఇద్దరు విద్యార్థినులకు రక్త పరీక్షలు చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉందని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి ఎం.ఆదిలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ గంగునాయుడు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించండి



విద్యార్థినులు అందించిన వినతిపత్రం పరిశీలిస్తున్న సీఐ నాగేశ్వరరావు

బొబ్బిలి: రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, ఎక్కడపడితే అక్కడ మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు జరుగుతున్నాయని ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్‌కుమార్, మణికుమార్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు, చిన్నారులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ స్థానిక పట్టణంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ చేరుకుని, రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేపట్టారు. ప్రధానంగా నియోజకవర్గంలోని వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థినులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఇటీవల ఎస్టీ వసతి గృహానికి వెళ్తున్న బాలికపై ఓ వ్యక్తి దాడికి ప్రయత్నించగా, అక్కడి నుంచి ఆ బాలిక భయంతో పారిపోయి తప్పించుకోవడం జరిగిందన్నారు. నిర్మానుష్య ప్రదేశాల్లో పోలీసుల నిఘా ఉంచాలని, చట్టాలను కఠినంగా అమలు చేసి, నిందితులను శిక్షించాలని కోరారు. అనంతరం సీఐ ఎం.నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అఖిల్, మహేష్, కేశవ, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను చెల్లించాలి

రాజాం సిటీ: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటి పన్ను వసూళ్లకు పక్కాగా చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొత్తకంచరాం గ్రామంలో ఇంటి పన్ను వసూళ్ల డేటాను సరిపోల్చే చర్యలు మంగళవారం చేపట్టారు.

దీనిలో భాగంగా ఇంటి కొలతలు వేసి మరీ డేటాను నమోదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను చెల్లించాలని, ఎవరికీ మినహాయింపు లేదన్నారు. ఆయా గ్రామాల్లో ఇళ్లకు వేసిన కొలతలు ప్రాప్తికి పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రుచి, శుచి కలిగిన భోజనం అందివ్వాలి

రాజాం సిటీ: మండలంలోని విజయరాంపురం ఎంపీపీ పాఠశాలను ఎంఈవో దుర్గారావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి, చూసి పరిశీలించారు. రుచి, శుచి కలిగిన భోజనం విద్యార్థులకు అందివ్వాలని, వంటగది శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని నిర్వాహకులకు తెలిపారు. అంతకుముందు పాఠశాలలో పీఎంసీ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షులుగా డి.ఇల్లమ్మను సభ్యులు ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అర్చన, ఎస్‌ఎంసీ చైర్మన్ డి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి మళ్లింపు చర్యలు

రాజాం సిటీ: స్థానిక మాధవబజార్‌లోని రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీటిని మళ్లించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా కుమ్మరవీధి వద్ద ప్రధాన కాలువకు అనుసంధానం చేసేలా కొత్త డ్రెయిన్ నిర్మాణం పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు మంగళవారం తెలిపారు. ఇప్పటికే కాలువపై ఆక్రమణలను గుర్తించి, మార్కింగ్ చేశామన్నారు. ప్రస్తుతం డ్రెయిన్‌పై పలకల నిర్మాణం చేస్తున్నామని, ఇది పూర్తయిన వెంటనే ఆక్రమణలు తొలగించి, డ్రెయిన్ నిర్మాణం పూర్తిస్థాయిలో పూర్తి చేస్తామన్నారు.

వాటర్ ప్లాంట్‌ల సీజ్



వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

రాజాం: పట్టణంతో పాటు మండలంలో పలుచోట్ల నిర్వహిస్తున్న ఆర్‌వో వాటర్ ప్లాంట్‌లను తహసీల్దార్ ఎస్.కె.రాజు, రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించారు. అంతకాపల్లి సమీపంలోని పొగిరి రోడ్డులో ఉన్న వాటర్ ప్లాంట్ మినహా మిగిలిన ఏ వాటర్ ప్లాంట్ నిర్వహణకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. అక్రమంగా నడుపుతున్న పలు వాటర్ ప్లాంట్‌లను సీజ్ చేశామని తెలిపారు.

కౌలురైతులకు రుణాలు మంజూరు చేయండి

- బ్యాంకర్లకు డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి ఆదేశం



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి

బొబ్బిలి రూరల్: బ్యాంకర్లు కౌలురైతుల పట్ల ఉదారంగా వ్యవహరించి, వారికి రుణాలు మంజూరు చేయాలని డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకర్లతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. వ్యవసాయ శాఖ ఏడీ శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ కౌలురైతులకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు వెనకంజ వేస్తున్నారని, తమ శాఖ ద్వారా ప్రభుత్వం రూ.7 కోట్ల మేర రుణ లక్ష్యం ఇవ్వగా బ్యాంకర్లు సహకరించడం లేదన్నారు. కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇస్తున్నామని, రుణ రికవరీకి రెవెన్యూ, వ్యవసాయ శాఖలు కూడా సహకరిస్తాయన్నారు. పొదుపు సంఘాల మహిళలు బ్యాంకులకు వస్తే వారిని నిర్లక్ష్యంగా చూడకుండా వారి పనులను వెంటనే చేయాలని తెలిపారు. నాబార్డు ఏజీఎం నాగార్జున మాట్లాడుతూ వ్యవసాయాధారిత పరిశ్రమలు, గొడౌన్లు, రైస్‌మిల్లుల నిర్మాణాలకు 33 శాతం సబ్సిడీపై రుణాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ రమణమూర్తి మాట్లాడుతూ బ్యాంకర్లు, ఆయా శాఖల అధికారుల పరస్పర సహకారంతో లక్ష్యాలు చేరుకోవాలన్నారు.

1200 మంది కౌలురైతుల గుర్తింపు..

రాజాం: నియోజకవర్గంలో 1200 మంది కౌలురైతులను గుర్తించామని, వారికి రెవెన్యూ శాఖ అధికారులు గుర్తింపుకార్డులు ఇస్తున్నారని వ్యవసాయ శాఖ రాజాం ఏడీఏ కె.చంద్రరావు తెలిపారు. ఇదే విషయమై స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద విలేకరులతో మంగళవారం మాట్లాడిన ఆయన.. గ్రామాల వారీగా కౌలురైతులను గ్రూపులుగా తయారు చేస్తున్నామని, వారికి బ్యాంకుల ద్వారా రుణాలు అందించనున్నామన్నారు. ఒక్కో గ్రూపులో నలుగురు నుంచి ఐదుగురు సభ్యులుంటారని, వారికి రూ.1 లక్ష నుంచి రూ.1.60 లక్షల వరకు రుణం వచ్చే అవకాశం ఉందన్నారు. రాజాం నియోజకవర్గానికి రూ.2 కోట్ల మేర రుణాలు ఇవ్వడమే లక్ష్యంగా చేసుకున్నామన్నారు.

339 మందికి గుర్తింపుకార్డులు..

వంగర: గ్రామాల్లో కౌలురైతుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ చిరంజీవి పడాల్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశమైన ఆయన.. మండలానికి 386 మంది కౌలురైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటివరకు 339 మందిని గుర్తించామని, వీరిలో 319 మంది కౌలురైతుల వివరాలు కంప్యూటరీకరించినట్లు తెలిపారు. ఆయన వెంట ఏవో తట్టికోట కన్నబాబు, డీటీ సుందరరావు తదితరులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ, తహసీల్దార్ సులోచనరాణి

రామభద్రపురం: వర్షాకాలం నేపథ్యంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ఈశ్వరమ్మ, తహసీల్దార్ సులోచనరాణి సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీఆర్‌డీ వెంకటరమణతో కలిసి గ్రామపంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు, వైద్యారోగ్య సిబ్బందితో మంగళవారం సమావేశమైన వారు మాట్లాడుతూ అల్పపీడన ప్రభావంతో రానున్న రెండురోజులు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే సీజనల్ వ్యాధుల వ్యాప్తికి అడ్డుకట్ట వేయగలమన్నారు. ప్రజలకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూనే దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీరాములునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతులకు గుర్తింపుకార్డులు ఇవ్వండి



వీఆర్‌వోలకు సూచనలిస్తున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మి

తెర్లాం: కౌలురైతులను గుర్తించి, వారికి గుర్తింపుకార్డులు ఇవ్వాలని తహసీల్దార్ రాజ్యలక్ష్మి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలతో మంగళవారం సమావేశమైన ఆమె.. మండలంలోని 33 గ్రామపంచాయతీల్లో కౌలు రైతులను గుర్తించి, వారి అర్హతలను పరిశీలించాలన్నారు. అనంతరం అర్హులైన కౌలురైతులకు గుర్తింపు కార్డులు మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. రైతు సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు వీఆర్‌వోలు కృషి చేయాలని తెలిపారు. సమావేశంలో హెచ్‌డీటీ జి.భాస్కరరావు, ఆర్‌ఐ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అడ్డుకట్ట తొలగించండి



బంగారువలస వద్ద తోటపల్లి కాలువలో సిమ్మెంట్‌తో నిర్మించిన అడ్డుకట్ట

వంగర: మండలంలోని బంగారువలస గ్రామ సమీపంలో తోటపల్లి కుడి ప్రధాన కాలువలో అక్రమంగా సిమెంట్‌తో వేసిన అడ్డుకట్ట నిర్మించారు. దీంతో బంగారువలస, కొప్పరవలస, కె.కొత్తవలస, మద్దివలస, రుషింగి, తలగాం, ఎం.సీతారాంపురం, వంగర తదితర గ్రామాలకు సాగునీటి సరఫరాకు తీవ్ర అంతరాయం కలుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎగువ ప్రాంతంలో చేసిన ఈ అడ్డుకట్ట నిర్మాణంతో చినరాజులగుమ్మడ పంటపొలాల వైపు సాగునీరు పోతోందని, తక్కువ నీటిసరఫరా సందర్భంలో దిగువ గ్రామాల పంటపొలాలకు సాగునీరు సరఫరా కావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి, అక్రమంగా నిర్మించిన అడ్డుకట్టను తొలగించి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే విషయమై ఇరిగేషన్ ఏఈ రాజేష్‌ను సంప్రదించగా, అడ్డుకట్ట తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముమ్మరంగా వరి ఉబాలు



సంతకవిటి: చింతలపేటలో వరి ఉబాలు వేస్తున్న మహిళలు

సంతకవిటి: మండలంలోని అన్ని గ్రామాల్లో వరి ఉబాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో వాతావరణం మారడంతో దాదాపు అన్ని గ్రామాల్లోని రైతులు వరి ఉబాలు వేయడంలో నిమగ్నమయ్యారు. ట్రాక్టర్లు, నాగళ్లతో దుక్కి పనులు చేస్తూ, కూలీలతో ఉబాలు వేయిస్తున్నారు.



సంతకవిటి: వాసుదేవపట్నంలో వరినారు సర్దుతున్న రైతులు

విద్యార్థుల నైపుణ్యాభివృద్ధిపై దృష్టిసారించండి



తెర్లాం: నెమలాంలో సంఖ్యాశాస్త్రంపై అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు



రేగిడి: లక్ష్మీపురంలో శిక్షా సప్తాహ్ శిక్షణను పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు



రాజాం: పెనుబాక పాఠశాలలో విద్యార్థులకు బోధనోపకరణాల సాయంతో విద్యాబోధన

తెర్లాం: విద్యార్థుల నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారించాలని ఎంఈవోలు జె.త్రినాధరావు, ఆర్.పాపారావు ఉపాధ్యాయులకు సూచించారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లో పునాది అభ్యసన, సంఖ్యాశాస్త్రం నైపుణ్యాలను పెంపొందించడంపై ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణను మంగళవారం పరిశీలించారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని, విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలని తెలిపారు. స్థానిక వనరులను వినియోగించి తయారు చేసుకున్న బోధనోపకరణాలు, చార్టుల ద్వారా పాఠ్యాంశాల్లోని అంశాలను విద్యార్థులకు వివరించాలన్నారు. విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కీలకపాత్రను పోషించాలన్నారు.

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం ప్రభుత్వ ప్రాథమిక, ఆదర్శ పాఠశాలలను ఎంఈవోలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్యలు మంగళవారం సందర్శించారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా అక్కడి ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణను పరిశీలించి, పలు సూచనలు చేశారు. పునాది అభ్యసనం, సంఖ్యాశాస్త్రం అంశాలను విద్యార్థులకు ఆసక్తిగా వివరించే విధానంపై ఇస్తున్న ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, రుచి, శుచి కలిగిన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఇనస్ట్రక్టర్లు సీతంనాయుడు, రమేష్‌కుమార్, రామకృష్ణ, శ్రీనివాసరావు, ఉపాధ్యాయుడు కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని పెనుబాక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ ఇస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడు మహేశ్వరరావు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిక్షణలో బోధనలోని మెలకువలను ఉపాధ్యాయులను నేర్చుకుని, విద్యార్థులకు విద్యాబోధన చేశారు. విద్యార్థులను బృందాలుగా ఏర్పాటు చేసి, బోధనోపకరణాల సాయంతో బోధించారు.